హైదరాబాద్ వార్త

జూపార్కులో సందర్శకులను ఆకట్టుకుంటున్న

నెమళ్లు,అడవి కోళ్లు

చార్మినార్,జనవరి 8 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని అడవి కోళ్లు,నెమళ్లు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.కొద్ది రోజుల క్రితం జూపార్కులో అడవి కోళ్లు,నెమళ్ల ఎన్‌క్లోజర్‌లను ప్రారంభించారు.ఈ రెండు ఎన్‌క్లోజర్‌లలో మూడు జతల అడవి కోళ్లు,రెండు జతల నెమళ్లు ఉన్నాయి.నెమళ్లు,అడవి కోళ్లు ఎన్‌కోజర్లు నుంచి బయటకు వచ్చి ఎంతో ఉత్సాహంగా తిరుగుతున్నాయి.కాగా జూపార్కును తిలకించటానికి వస్తున్న పర్యాటకులు,చిన్న పిల్లలు మరీ మక్కువతోనెమళ్లు,అడవి కోళ్లను చూస్తున్నారు.చలి కాలంగా సందర్భంగా వెచ్చదనం కోసం ఎన్‌క్లోజర్లు చుట్టూ గోనె సంచులు చుట్టారు.నెమళ్లు,అడవి కోళ్లు రాత్రి వేళ్లలో గూళుల్లో ఉంటున్నాయి.జూపార్కులో ప్రస్తుతం దాదాపు నూట యాభై ఎన్‌క్లోజర్లు ఉన్నాయి.చలి తీవ్రంగా ఉండటంతో జూపార్కులోని జంతువులు,పక్షుల సంరక్షణ కోసం ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశామని జూపార్కు క్యూరేటర్ జె.వసంత వెల్లడించారు.

పతంగుల పండుగ వచ్చేసిందోచ్...

-నగరంలో జోరుగా విక్రయాలు
-వినియోగదారులతో కళకళలాడుతున్న దుకాణాలు
-కుటీర పరిశ్రమలుగా పతంగుల అమ్మకాలు

హైదరాబాద్,జనవరి 8, ప్రభాతవార్త: పతంగుల సీజన్ ప్రారంభమైంది. నగరంలోని హోల్‌సేల్,రిటైల్ దుకాణాల్లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రెండు మూడు రోజులుగా హోల్‌సేల్ రిటైల్ దుకాణాల్లో కొత్తకొత్త వెరైటీ పతంగులతో కనువిందు చేస్తున్నాయి. పతంగులకు నిజాం నవాబు కాలం నుండే పాతబస్తీలో ఆదరణ ఉంది. ప్రస్తుతం కంప్యూటర్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చి ఎన్నోరకాల కొత్తకొత్త వినోద కార్యక్రమాలు,గేమ్స్ అందుబాటులోకి వచ్చినా నేటికీ పతంగుల ఆటకు ఏమాత్రం వన్నెతగ్గలేదు. చిన్నా పెద్ద తేడాలేకుండా అందరూ ఎగురవేస్తూ వినోదం పొందుతారనడంలో సందేహం లేదు. జనవరి మాసంలో ఏబిల్డింగ్ లోగానీ, మైదానంలోగానీ ఎటు చూసినా పతంగులనే ఎగురవేస్తుంటారు. సెప్టెంబర్ నుండి జనవరి వరకు వీటి వ్యాపారం జోరుగా సాగుతుంటుంది. అందుకోసం ఇప్పటి నుండే పదుల సంఖ్యలో కొత్తకొత్త వెరైటీలు మార్కెట్‌లోకి వచ్చేశాయి.

జోరుగా విక్రయాలు...

నగరంలో పతంగుల అమ్మకాలు జోరందుకున్నాయి ఏపాపులో చూసినా చిన్నపిల్లలు యువకులతో కళకళలాడుతున్నాయి. నగరంలోని వనస్థలీపురం, ఎల్‌బీనగర్, దిల్‌షుఖ్‌నగర్, అంబర్‌పేట్, రామాంతపూర్, మియాపూర్, బాలానగర్ సికింద్రాబాద్ ప్రాంతాల్లో క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి.రంగురంగుల విభిన్న మైన రీతిలో ఉన్న పతంగులను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. దారం,మాంజా,చర్కా,గోటీల వంటి సామాగ్రి పతంగుల దుకాణాల్లో విక్రయానికి ఉంచారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు త్వరలో సంక్రాంతి సెలవులు రానుండటంతో వారం రోజుల ముందుగానే గాలిపటాలను ఖరీదు చేస్తుండడంతో పతంగుల దుకాణాల వద్ద యువతీ,యువకులతో రద్దీ పెరిగింది. గత ఏడాదికన్న ఈ ఏడాది పతంగులు మాంజాలు ధరలు పెరిగినా కొనుగోలు మాత్రం తగ్గలేదని అమ్మకాందారులు తెలుపుతున్నారు.

కుటీర పరిశ్రమలుగా పతంగుల అమ్మకాలు..

పాతబస్తీలోని ధూల్‌పేట్ ,బహదూర్‌పురా, కాలాపత్తర్,హుస్సేనీఅలం, గుల్జార్‌హౌజ్,తలాబ్‌కట్ట, ప్రాంతాల్లోని ఇళ్లలోనే పతంగులను తయారు చేసిహోల్‌సెల్ దుకాణాలకు సరఫరా చేస్తారు. వారినుండి నుండి ఆర్డర్లు తీసుకొని ఇళ్లల్లో తయారు చేసి వారికి అందజేస్తారు.ప్రస్తుతం పదుల సంఖ్యలో కుటుంబాలు పతంగుల తయారీలో బిజీగా ఉన్నాయి. ఇక్కడ తయారయ్యే పతంగులు,మాంజాలను నగర ప్రజలతో పాటు వివిధ జిల్లాలకు,రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తుంటామని తయారీ దారులు తెలిపారు నగరంలో కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి వ్యాపారులు వచ్చి పాతబస్తీలోని హోల్‌సేల్ దుకాణాల్లో కొనుగోలు చేస్తుంటారు.

జిహెచ్ఎంసి.. 'వన్ టైం సెటిల్‌మెంట్'

-ఆస్తిపన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ
-అసలు, 10శాతం వడ్డీ కడితే అంతా క్లియర్
-ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులన్నింటికి వర్తింపు
-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త: నగరవాసులకు జిహెచ్ఎంసి తీపి కబురు అందించింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని ఆస్తిపన్ను బకాయిదారులకు భారీ ఊరటనిస్తూ వన్ టైమ్ స్కీమ్ (ఓటిఎస్)ను ప్రకటించింది. దీర్ఘకాలంగా పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలపై ఉన్న వడ్డీలో 90 శాతాన్ని మాఫీ చేస్తున్నట్లు గురువారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఓప్రకటనలో తెలిపారు. ఈరాయితీ జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రైవేట్ ఆస్తులతో పాటు ప్రభుత్వ ఆస్తులకు కూడా వర్తిస్తుంది. ముఖ్యంగా బకాయి పడ్డ ఆస్తిపన్ను మొత్తంతో పాటు, దానిపై పేరుకుపోయిన వడ్డీలో కేవలం 10 శాతం చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 90 శాతం వడ్డీని ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తుంది. అయితే ఈ రాయితీని పొందాలంటే పన్ను మొత్తాన్ని అలాగే 10 శాతం వడ్డీని ఒకే విడతలో చెల్లించాల్సి ఉంటుంది. ఈపథకం 2025-26 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయడంతో పాటు, పన్ను చెల్లింపుదారులపై ఉన్న వడ్డీ భారాన్ని తగ్గించాలన్న ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నగరవాసులు తమ ఆస్తిపన్ను బకాయిలను క్లియర్ చేసుకోవాలని జిహెచ్ఎంసి అధికారులు కోరుతున్నారు. ఓటిఎస్ కింద పన్నులు చెల్లించేవారు మైజిహెచ్ఎంసి యాప్, మీసేవా కేంద్రాలు, జిహెచ్ఎంసి సిటిజన్ సర్వీస్ సెంటర్లు (సిఎస్‌సిఎస్),ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలి

-తరగతి గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్,జనవరి 8,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నందున విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించి, మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. గురువారం నాంపల్లిలోని ఎల్‌బి స్టేడియం ఎదురుగా గల ప్రభుత్వ ఉన్నత మోడల్ పాఠశాల ఆలియాను సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులను పరిశీలించి ఉత్తమ ఫలితాల సాధనకై మెరుగైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల గదులతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సబ్జెక్టుల గురించి, సమయానికి ఆహారం అలాగే ఎంత వరకు సబ్జెక్టులు పూర్తయ్యాయి అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం కర్మిక్ కనెక్షన్ ఫౌండేషన్ నిర్మాహకురాలు ఉమా అందించిన 250 ఫ్లవర్ మిల్క్ ప్యాకెట్లను విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఇఓ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

బండ్లగూడ సర్కిల్‌ను సైబరాబాద్‌లోకి మార్చాలి

- ఆల్ పార్టీ నాయకుల డిమాండ్
- సిఎంను కలిసి మా బాధలు విన్నవించుకుంటామన్న నేతలు
- సర్కారు స్పందించకుంటే ఉద్యమం చేస్తామన్న నాయకులు



హైదర్షాకోట్ డివిజన్‌లో హైదరాబాద్ వద్దు-సైబరాబాద్ ముద్దు అంటూ నినదిస్తున్న పాత బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ ఆల్ పార్టీస్ నాయకుల దృశ్యం

నార్సింగి, జనవరి 8 ప్రభాతవార్త : పాత బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను సైబరాబాద్‌లోకి మార్చాలని ఆల్ పార్టీస్ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ వద్దు-సైబరాబాద్ ముద్దు అంటూ పార్టీలకు అతీతంగా కలిసిన నాయకులంతా ముక్తకంఠంతో నినదించారు. గురువారం హైదర్షాకోట్ డివిజన్ పరిధిలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో అధికార కాంగ్రెస్ పార్టీతో సహా బిఆర్ఎస్, బిజెపి ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు 200.మందికి పైగా అఖిలపక్ష ప్రజా వేదిక పేరుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను సైబరాబాద్ నుంచి తొలగించి హైదరాబాద్ కమీషనరేట్ పరిధిలోకి నెట్టడం, మా రాజకీయ భవిషత్తును, మా ప్రాంత అభివృద్ధిని కాలరాయడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శివారు మున్సిపాలిటీలను గ్రేటర్‌లో కలుపడానికి ముందు స్థానిక ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదని, ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ప్రజలు, ప్రజా ప్రతినిదులను ఇబ్బందులపాలు చేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించబడాలంటే స్థానికంగా అందుబాటులో ప్రజా ప్రతినిదులు, అధికారులు ఉండేలా పరిపాలన చేయాలని, ఇలా చెలిమలను తీసుకెళ్లి సముద్రంలో కలిపినట్లు, మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో కలుపడం ఏ రకంగా చూసినా ప్రజలకు కీడు చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు లీడ్ తీసుకొని మన న్యాయమైన పోరాటానికి బలం ఇవ్వాలని, మన బండ్లగూడ కార్పోరేషన్‌ను తిరిగి సైబరాబాద్‌లోకి మార్చేంత వరకు పార్టీలకు అతీతంగా ఉద్యమిద్దామని స్పష్టం చేశారు. అనంతరం ముదిరాజ్ కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ మంత్రులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ విషయంపై న్యాయం చేయాలని కోరుతామని స్పష్టం చేశారు. చార్మినార్‌లోనే కొనసాగిస్తే రాజకీయ నాయకులు భవిష్యత్తును కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత బిడ్డగా మనకు మేలు జరిగేలా నావంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గండిపేట మండలం మొత్తం ఒకే జోన్ పరిధిలో ఉండాలని, లక్షా 50.వేల మంది జనాభా, 90.వేల ఓటర్లు, 245.కాలనీలు ఉన్న ఈ ప్రాంత ప్రజల న్యాయమైన డిమాండ్‌ను తీర్చాలని సీఎంను కలుస్తామన్నారు. అనంతరం బిఆర్ఎస్ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ విలీన ప్రక్రియతో బండ్లగూడకు తీరని అన్యాయం జరిగిందని, కనీసం 5.డివిజన్లను ఏర్పాటు చేస్తేనే ప్రజలకు అందుబాటులో ఉండి, వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు వీలు పడుతుందన్నారు. సీఎంను కలిశాక న్యాయం జరుగకపోతే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. బిజెపి అద్యక్షులు మహేష్ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొనసాగిస్తే మా ప్రాంత అస్థిత్వంనే కోల్పోతామని పేర్కొన్నారు. బండ్లగూడకు జరుగుతున్న అన్యాయంను బిజెపి రాష్ట్ర అద్యక్షుడికి వివరించామని, న్యాయం జరిగేలా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారని వివరించారు. ఈ సమావేశంలో ఆల్ పార్టీస్ నాయకులు భీమార్జున్‌రెడ్డి, మహాలింగంగౌడ్, మాధవరెడ్డి, ఆంజనేయులు, రాందాస్ ముది రాజ్, రాంప్రసాద్, ప్రేమ్‌గౌడ్, నవీన్, తలారి ప్రేమ్, సంజీవ్‌రెడ్డి, పెంటయ్య, వెంకటేష్, రత్నం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బొలారంలోని రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన ఉత్సవ్‌లో పాల్గొన్న విదేశాంగ శాఖ ప్రతినిధులు

సికింద్రాబాద్ ప్రాంత అస్థిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్ర : తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, జనవరి 8 ప్రభాతవార్తః ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్ ప్రాంత అస్థిత్వాన్ని దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. గురువారం పద్మారావునగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడారు. సికింద్రాబాద్‌ను కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని ఈ నెల 11వ తేదీన బాలంరాయ్‌లోని లీ ప్యాలెస్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ వాణిజ్య, వ్యాపార కార్మిక సంఘాలు, పలు కాలనీలు, బస్తీల కమిటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఈ నెల 17 వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ఎంజీ రోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిర్వహించనున్న భారీ ర్యాలీ, భవిష్యత్ కార్యాచరణ పై చర్చించడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ అంటే జంట నగరాలుగా ఎంతో ప్రసిద్ధి ఉందని పేర్కొన్నారు. 1806 సంవత్సరంలో సికింద్రాబాద్ ప్రాంతం ఏర్పాటు అయిందని చెప్పారు. సికింద్రాబాద్ పేరును, ఈ ప్రాంతానికి ఉన్న చరిత్రను తుడిపి వేయాలనే కుట్రలను ప్రభుత్వం చేస్తుందని అన్నారు. 1897 లో 120 అడుగుల ఎత్తుతో నిజాం కాలంలో నిర్మించిన క్లాక్ టవర్ చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పేర్లతో మూడు కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఎట్టి పరిస్థితుల్లో సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు జరిగే వరకు ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు వంటి ఆందోళన కార్యక్రమాలు దశలవారీగా చేపడతామని హెచ్చరించారు. ఇది ఒక పార్టీకి సంబంధించిన పోరాటం కాదని, ఈ ప్రాంత ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన పోరాటంగా ఆయన పేర్కొన్నారు. తమ పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ఉద్యమ సంఘాలు, అన్ని వర్గాలను ఆహ్వానిస్తామని వివరించారు. ఇది రాచరిక పాలన కాదనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలి అన్నారు. ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా, ఈ ప్రాంత చరిత్రను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం నియంతృత్వ ధోరణికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

ఉజ్జయినీ మహాకాళీ హుండీ ఆదాయం రూ16,44,729లు

మహాకాళీ ఆలయంలో హుండీ లెక్కింపు చేస్తున్న దృశ్యం.

బేగంపేట జనవరి 8,ప్రభాతవార్త సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి హుండీ లెక్కింపు గురువారం జరిగింది.దేవాలయంలో ఉన్న హుండీలలో 62రోజులకు సంబంధించిన ఆదాయాన్ని లెక్కించారు.ఈ లెక్కింపు లో దేవాదాయ శాఖ ఇన్స్ పెక్టర్ శ్రీదేవి,ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి,ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్ సురిటి రామేశ్వర్,సురిటి కామేశ్వర్‌లు,మాజీ ట్రస్ట్‌బోర్డు మెంబర్లు,బ్యాంకు అధికారులు,భక్తుల సమక్షంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని అమ్మ వారికి సమర్పించిన కానుకలు లెక్కించగా మొత్తం రూ 16,44,729లు వచ్చాయి. వాటిలో నోట్లు రూ 14,82,654లు,కాయిన్స్ రూ 1,62,075 లు మొత్తం రూ 16,44,729లు వచ్చాయని,62 గ్రాముల విశ్రమ బంగారం,758గ్రాముల విశ్రమ వెండి అమ్మ వారికి కానుకల రూపంలో వచ్చినట్లు ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.

ప్రియుడి హత్య కేసులో భార్యభర్తలు,మరో ఐదుగురి అరెస్ట్

చార్మినార్,జనవరి 8 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ మహరాజ్‌గంజ్‌లో అక్రమ సంబంధం వల్ల ప్రియుడు హత్యకు గురైన సంఘటనలో భార్య భర్తలతో పాటు మరో ఐదు మంది నింధితులను కామాటిపుర పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నింధితుల వద్ద నుంచి కత్తి,రెండు వాహనాలు,ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె.భాస్కర్ ఎస్ఐలు వి.సుమన్,ఆర్.నాగరాజుతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.పాతబస్తీ హుస్సేనీఆలం కబూతర్‌ఖాన్ ప్రాంతంలో ఠాకూర్ అమిత్ సింగ్ (40) భార్య నేహ పిల్లలతో కలిసినివాసం ఉండేవాడు.కాగా మత్కటి రవి (35),భార్య పూజ (28) ఇద్దరు పిల్లలతో కలిసి ఠాకూర్ అమిత్ సింగ్ ఇంటి ప్రక్కనే అద్దె ఇంట్లో ఉండే వారు.ఈ క్రమంలోనే ఠాకూర్ అమిత్ సింగ్,పూజ మధ్య ప్రేమ ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది.అక్కడ నుంచి రవి ఇంటిని ఖాళీ చేసి హుస్సేనీఆలంలోని కాలభైవర్ హనుమాన్ మందిరం ప్రాంతానికి మార్చాడు.అయినప్పటికి అమిత్ సింగ్, పూజ మధ్య అక్రమ సంబంధం కొనసాగుతున్నది.అమిత్‌సింగ్,పూజకు పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు.అమిత్ సింగ్ మాత్రం వివాహేతర సంబంధాన్ని కొనసాగించాలని పూజను వేధించసాగాడు.ఈ విషయాన్ని పూజ తన భర్త రవికి తెలపటంతో మాట్లాడుతామని అమిత్‌సింగ్‌ను ఈ నెల 3న మహరాజ్‌గంజ్‌లోని పోచమ్మ మందిరానికి పిలిపించారు.భార్య భర్తలు రవి,పూజ.మరో ఐదు మంది కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చారు. అమిత్ సింగ్ రవి కుటుంబ సభ్యులమధ్య గొడవ జరగటంతో కోపంలో రవి కత్తితో ఠాకూర్ అమిత్ సింగ్ కడుపు,ఛాతిలో కత్తితో పొడిచి అక్కడ నుంచి పారిపోయాడు.తీవ్ర గాయాల పాలైన అమిత్ సింగ్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మరణించాడు.పూజతో ఉన్న అక్రమ సంబంధం వల్లనే అమిత్ సింగ్ హత్యకు గురియ్యాడని పోలీసుల విచారణలో తేలింది.హత్యకు కారకులైన రవి (35) భార్య పూజ (28),ప్రదీప్ కుమార్ (29),షెట్కర్ అక్షయ్ (25),షెట్కర్ అనిష్ (21),మహేష్ కుమార్ పాటిల్ (33).అలె అవినాష్ (25)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.నింధితుల వద్ద నుంచి కత్తి,రెండు ద్విచక్ర వాహనాలు,ఏడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును కామాటిపుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమావేశం హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న కామాటిపుర ఇన్‌స్పెక్టర్ భాస్కర్

బస్సులో ఫోన్ చోరి.. విశ్రాంత ఉద్యోగి ఖాతాలో రూ. 1.84 లక్షలు మాయం

జూబ్లీహిల్స్, జనవరి 8, ప్రభాతవార్తః బస్సులో చోరికి గురైన ఫోన్ ద్వారా ఒక విశ్రాంత ఉద్యోగి ఖాతాలో రూ. 1.84 లక్షలు మాయమైన సంఘటన మధురా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి డి. మనోహర్(69) అమీర్‌పేటలోని సారథి స్టూడియో వద్ద 10వై/ఎఫ్ ఆర్టీసీ బస్ ఎక్కారు. కార్మికనగర్ బస్టాప్‌లో దిగిన అతను తన జేబులోని చరవాణి చోరికి గురైనట్లు గుర్తించాడు. అతని ఎయిర్‌టెల్ సిమ్‌కార్డు సైతం బ్లాక్ అయ్యింది. మరో సిమ్‌కార్డు తీసుకొన్నప్పటికి అది చాలా సమయం వరకు పనిచేయలేదు. దీంతో అతను బ్యాంకు వెళ్లి తన ఖాతా వివరాలను పరిశీలించగా ఖాతాలో ఉండాల్సిన డబ్బులో రూ. 1.84 పలు ఖాతాలకు యూపిఐ ద్వారా మళ్లించినట్లు గుర్తించాడు.దీంతో అతను మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగీత ప్రపంచంలో ధ్రువతార త్యాగరాజ స్వామి ..హాస్యావధాని శంకరనారాయణ

సంగీత గురువు శంకరమంచి లక్ష్మీప్రియలను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి జనవరి 8 ప్రభాతవార్త : సంగీత ప్రపంచంలో త్యాగరాజ స్వామి ఒక ధ్రువతార అని ప్రముఖ పాత్రికేయులు, హాస్యావధాని కళారత్న డాక్టర్ శంకరనారాయణ అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ఐదు రోజులు జరిగే విఖ్యాత వాగ్గేయ కారుడు త్యాగరాజ స్వామి 179 వ ఆరాధనోత్సవాలలో భాగంగా ప్రముఖ సంగీత గురువు శంకరమంచి లక్ష్మీప్రియ, గోవిందు లక్ష్మీ పద్మావతి, వీణ గురువు సప్తస్వరాలు , కూచిపూడి నాట్య గురువు పుతోలి రాజశ్రీ ఆధ్వర్యంలో జరిగిన సంగీత, నృత్య, వీణా ప్రదర్శనలు త్యాగరాజ స్వామికి నీరాజనాలు అర్పించారు. డాక్టర్ శంకరనారాయణ మాట్లాడుతూ త్యాగరాజ స్వామి కేవలం కీర్తనకారుడు మాత్రమే కాదు, భక్తి మరియు సంగీతాల కలయికతో మోక్ష మార్గాన్ని చూపిన మహనీయుడు అని అన్నారు. రామభక్తి సామ్రాజ్యాన్ని తన కీర్తనలతో నిర్మించిన త్యాగయ్య, ఖిసంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము గలదే మనసా అని చాటి చెప్పారు. ఆయన రాసిన ప్రతి కృతి ఒక అద్భుతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా పంచరత్న కీర్తనల గోష్ఠి గాన సేవ

శంకర్ మట్‌లో పంచరత్న కీర్తనల గోష్ఠి గానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి జనవరి 8 ప్రభాతవార్త : భారతీయ కళా సమితి ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు గురువారం స్థానిక శంకర్ మట్ లో ఆధ్యాత్మిక వాతావరణంలో కన్నుల పండువగా సాగాయి. గాత్రంపై కె. మృదుల, మహిత్ ఆదిత్య అద్భుతంగా స్వామివారికి పంచరత్న కీర్తనల గోష్ఠి గాన సేవ చేశారు. సంగీత కళాకారులు రవి కులోత్తమ్ రావు విద్వాన్ ఈమని లలిత కృష్ణ, చంద్రశేఖర్, కొనికి శ్రీనివాస్, సోమయాజు లు తదితరులు పాల్గొని గానం చేశారు. శంకర్ మట్ ధర్మాధికారి శ్రీనివాస్, కార్యదర్శి తాండవ కృష్ణ అద్భుతంగా పంచరత్న కీర్తనలను ఆలపించిన సాంగేత కళాకారులను సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.

బీమా కంపెనీలు క్లెయిమ్‌లు చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: వితంతువులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, కుటుంబాలకు చెందిన వారికి దేశవ్యాప్తంగా తిరిగి ఇవ్వని బీమా డబ్బులు వేల కోట్ల రూపాయలు ఉన్నాయని వాటిని తిరిగి వెంటనే చెల్లించేలా యునైటెడ్ ఓటర్స్ సోషల్ ఫౌండేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ కన్వీనర్ దిలీప్‌కుమార్, కార్యదర్శి డా.సందీప్‌రెడ్డి మాట్లాడుతూ ఐఆర్డీఏ ప్రకారం 57 బీమా కంపెనీలలో 9,578 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇందులో 7,065 కోట్లు జీవిత బీమా కంపెనీలో (ఎల్ఐసి) పెరుకుపోయాయని చెప్పారు. ఎంతో కష్టపడి ప్రజలు బీమా కంపెనీల్లో డబ్బులు జమ చేసుకున్నారని, అవి సకాలంలో క్లెయిమ్ రాకపోవడంతో మానసికంగా కుంగి అనారోగ్యానికి గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. బకాయిపడ్డ బీమా డబ్బులు పేదలు, రైతు లబ్ధిదారులకు చెల్లించేంతవరకు తాము ఉద్యమిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ తెలంగాణ ప్రతినిధి సంతోష్, ప్రతినిధులు రాజిరెడ్డి, మల్లం వెంకటేష్‌గౌడ్, న్యాయవాది స్రవంతి, విజయ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎంఆర్ఎఫ్ :ఎమ్మెల్యే గోపాల్

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్‌చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి జనవరి 8 ప్రభాతవార్త : ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు అండగా నిలిచేందుకు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపకరిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం గాంధీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు 23 మందికి సుమారు 7,40,000 విలువ గల సి ఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు అండగా నిలిచేందుకు ఈ నిధులను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వం నుండి అందే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షులు ఎం రాకేష్ కుమార్, శంకర్ ముదిరాజ్, శ్రీధర్ రెడ్డి, శ్యామ్ యాదవ్, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, దామోదర్ రెడ్డి, సాయి కుమార్, ముఠా నరేష్, శివ ముదిరాజ్, శ్రీధర్ చారి తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తెలుగుభాషానిలయం

విద్యార్థులకు బోధన కావిస్తున్న విశ్వనాథం, ఉదయవర్లు తదితర అతిథులు

నాంపల్లి, జనవరి 8 ప్రభాతవార్త : డిగ్రీస్థాయి విద్యార్థుల ఉజ్జ్వల భవిష్యత్తు నిర్మాణం, భాషా, సాహిత్యం, సంస్కృతులపట్ల అభిమానం పెంపొందించి వ్యవహరించడం కోసం, వ్యక్తిగా సమున్నతంగా ఎదగ డం కోసం, వ్యక్తిత్వ నిర్మాణం కోసం శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం తలపెట్టి చేపట్టిన యువత కోసం కార్యక్రమ పరంపరలో మొదటిది గురువారం భాషానిలయంలో వైభవం గా ప్రారంభమైంది. జంటనగరాలలోని ఎంపిక చేసిన కళాశాలలోని విద్యార్థులు ఈ కార్యక్రమంతో ఎంతో ఆసక్తి ఉత్సుకతతో పాల్గొన్నా రు. వ్యక్తిత్వ వికాస బోధన నిపుణుడు, ప్రసిద్ధ విద్యావేత్త డా. వంగపల్లి విశ్వనాథం ప్రథమ సమావేశంలో కీలక ప్రసంగం కావించి విద్యార్థులతో కార్యక్ర మాన్ని నిర్వహించారు.ముందుగా తెలుగు భాషానిలయం గౌరవ కార్యదర్శి ఉదయవర్లు యువత కోసం కార్యక్రమ లక్ష్యాన్ని, భాషా నిలయం తెలుగు భాషా వికాసం కోసం చేస్తున్న సేవలను సవివ రపరిచారు.యువత కోసం ప్రథమ కార్యక్రమం విజయవంతంగా సాగింది.

రిజర్వేషన్లలో మాలలకు న్యాయం చేయాలి

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు వినతి

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు

చిక్కడపల్లి జనవరి 8 ప్రభాతవార్త : రిజర్వేషన్లలో మాలలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు గురువారం మీనాక్షి నటరాజన్ ను కలిసి సమస్యలను ప్రస్తావించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వలన నష్టపోయిన మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టం 2025ను సవరించాలని రిజర్వేషన్ శాతం పెంచి రోస్టర్ పాయింట్ లు మార్పు చేయడం ద్వారా ఈ 26 కులాలకు న్యాయం చేయవచ్చని కోరారు. ఎస్సీ లోని గ్రూప్ త్రీ కి 26 కులాలకి ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించినప్పటికీ ఒక్క శాతం రిజర్వేషన్ కూడా అమలు కావట్లేదని ఒక్క ఉద్యోగం కూడా రావట్లేదని ఇప్పటివరకు విడుదలైన చాలా ఉద్యోగ నోటిఫికేషన్ లలో ఎస్సీలకు ఉద్యోగాలు కేటాయించినప్పటికీ గ్రూప్ త్రీకి ఒక్క ఉద్యోగం కూడా కేటాయించట్లేదని రిజర్వేషన్లలో ఉన్న లోపాలను ఎస్సీ వర్గీకరణ చట్టంలో ఉన్న లోపాలను సవరించి కేటాయించిన ఐదు శాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా చూడాలని కోరడం జరిగింది అన్ని కులాలకు ఓసి బీసీ ఎస్టి ఏడబ్ల్యూఎస్ ఎస్సి గ్రూప్ 1 గ్రూప్ 2 లకు పదిలోపు రోస్టర్ పాయింట్ల కేటాయించారని అదేవిధంగా మాలలకు పది లోపు రోస్టర్ పాయింట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశాం గ్రూప్ త్రీ కి రిజర్వేషన్ శాతం ఐదు నుంచి ఏడు శాతానికి పెంచాలని మరియు పది లోపు రోస్టర్పాయింట్ కేటాయించాలని విద్య ఉద్యోగం పదోన్నతులలో రిజర్వేషన్ శాతం పక్కాగా అమలయ్యే విధంగా చూడాలని కోరారు.

సిపిఐ శతాబ్ధి ఉత్సవాల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

కవాతులో పాల్గొన్న ఇ.టి.నర్సింహ్మా

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: అసమానతలు, దోపిడి, మతత్వం, కార్పోరేట్, ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ శతాబ్ధి ఉత్సవాలు ముగింపును పుస్కరించుకుని జనసేవాదళ్ నారాయణగూడలో భారీగా సిపిఐ కవాతు నిర్వహించింది. ఈ సందర్భంగా ఇ.టి.నర్సింహ్మా జనసేవాదళ్ శిక్షణ కార్యక్రమాన్ని, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వలసవాద వ్యతిరేక ప్రతిఘటన రాజీలేని కార్మికులు, రైతులు పోరాటాల ద్వారా నిర్మించబడ్డ సిపిఐ 100 సంవత్సరాల చరిత్ర మహోన్నతమైనదని చెప్పారు. ఈ శతాబ్ధి కేవలం చరిత్ర గురించి మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని మరింతగా పెంచడానికి మతత్వం, ఫాసిజం, అసమానత శక్తులను ప్రతిఘటించడానికి పిలుపు అని ఆయన తెలిపారు. కార్మికులు, రైతులు, మహిళలు, అణగారిన వర్గాల గొంతుకగా ఎర్రజెండాద సమానత్వం, లౌకికవాదం, గౌరవం కోసం నిలుస్తుందన్నారు. ఈ శతాబ్ధి ఉత్సవాల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటం, ప్రజల జీవనోపాధి కోసం బలమైన పోరాటాలు కొనసాగిస్తూనే ఉండాలని ఆయన కోరారు. సిపిఐ శతాబ్ధి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఈ నెల 18న ఖమ్మం నగరంలో లక్షలాది మందితో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

కొందరి స్వలాభం కోసమే అనాలోచిత నిర్ణయాలు

-ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఒత్తిడి తీసుకురావాలి

-నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి కార్తీక్ రెడ్డి

అత్తాపూర్ జనవరి8,ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ముడూ ముక్కలు చేసి తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తుందని నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జీ కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో ఆరంఘర్ చౌరస్తాలో బిఆర్ఎస్ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా హైదరాబాద్ వద్దు...సైబరాబాద్ ముద్దు అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు.ఈ కార్యక్రమానికి అతిథిగా నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జీ కార్తీక్ రెడ్డి హాజరైయ్యారు.ఆయన మాట్లాడుతూ....కొందరి కోసం చౌకబారు నిర్ణయం వల్ల రాజేంద్రనగర్ సర్కిల్ అస్తిత్వం కోల్పోయే ప్రమాదంలో పడిందని ప్రభుత్వముపై ధ్వజమెత్తారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే రాజేంద్రనగర్ సర్కిల్ హైదరాబాదులో కలపాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక తీసుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ , సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి ,డి.రమేష్ ముదిరాజ్ పోరెడ్డి ధర్మారెడ్డి , జీవన్ దాస్ , వనం శ్రీరామ్ రెడ్డి, నోముల రాము అక్యం రాఘవేందర్ యాదవ్ యాదవ్ ,ఎడ్లకాడి సూర్యం, జె చిత్తారి , కే.లక్ష్మీ రాజ్, సరికొండ దుర్గేష్ రాజేష్ యాదవ్, ముక్రం ఖాన్ జహీర్ ఖాన్ నయీముద్దీన్ మైసి రెడ్డి వెంకటరమణ,గంజి రాజు, గుమ్మడి కుమార్ , ఎర్లపల్లి ప్రవీణ్ శివారెడ్డి, ప్రసన్న సరితా పద్మ సుగుణ కొంపల్లి జగదీష్ చిరంజీవి బాలరాజ్ యాదవ్,నరేష్ యాదవ్ జనాపూర్ సునీల్ ,మహేష్ గోపాల్ నాయక్ అశోక్ ,నాగని సురేష్, మనోహర్,చంద్ర శేకర్,రాజు,సర్కిల్ నాయకులు ఉద్యమ నాయకులు మా జీ ప్రజాప్రతినిధులు మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ

ఆర్టీసీ క్రాస్ రోడ్స్ మెట్రో స్టేషన్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్

చిక్కడపల్లి జనవరి 8 ప్రభాతవార్త : గాంధీనగర్ డివిజన్ లో విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించబోతున్నట్లు స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ మెట్రో స్టేషన్ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంక్ ప్రక్క వీధిలో గత 15 ఏళ్లుగా రోడ్డుకు అడ్డంగా మరియు ప్రమాధకరంగా వున్న కరెంట్ స్థంబాలను తొలగించాలని స్థానికులు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి ఎ.పావని వినయ్ కుమార్ కి చేసిన ఫిర్యాదు మేరకు, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించి ప్రమాదకరంగా ఉన్న 5 కరెంట్ స్థంబాలను తొలగించి మరో చోట ఏర్పాటు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం సిబ్బంది స్థంబాలను తొలగించి మరో చోట ఏర్పాటు చేసిన పనులను కార్పొరేటర్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ ,సీబీడీ ఎఈ నర్సింగ్ రావు,గాంధీనగర్ ఎఈ సంతోష్, స్థానికులు మరియు బిజెపి నాయకులతో కలసి పర్యవేక్షించారు.15 ఏళ్ల సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్ ప్రత్యేక చేర్యాల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్,ఆనంద్ రావు,నీరజ్,జ్ఞానేశ్వర్ మరియు స్థానికులు సాల్మన్ రాజు,శివకుమార్,ప్రకాష్ రెడ్డి,పాల్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

విద్యుత్ అధికారులతో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 8 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని రాజేంద్ర నగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్‌తోకల శ్రీనివాస్ రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్యాలయంలో గురువారంటిజిఎస్‌పిడిసిఎల్ అధికారులు కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై ఆయన విద్యుత్ అధికారులతో చర్చించారు.ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను మార్చిడి,దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు,సింగిల్ ఫేస్ కారణంగా కలుగుతున్న సమస్యలు గురించి ఆయన విద్యుత్ అధికారులకు వివరించారు.ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తామని అధికారులు హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ శ్రీరామ్ మోహన్,డిఈ రత్నాకర్,ఏడిఈ ఈశ్వర్ ప్రసాద్,ఏఈలు సతీష్ కుమార్, సాయి,నర్సింహ్మా,ఆరిఫ్,వినోద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పేద, బడుగు బలహీన వర్గాలకు తమ పార్టీలో సముచిత స్థానం

ఖాజాకు నియామకపత్రాన్ని అందిస్తున్న పార్టీ నేత

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలను రాజకీయాల్లో రాణించేందుకు తమ పార్టీ అవకాశం కల్పిస్తుందని ఆలిండియా మజ్లిస్-ఈ-ఇన్‌క్విలాబ్-ఈ-మిల్లత్ జాతీయ అధ్యక్షుడు, కవి అబ్బాసి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సమీవుల్లా అజాద్ చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్‌సిపి పార్టీకి చెందిన మహ్మద్ ఖాజాను మిల్లత్ పార్టీలో చేరిన సందర్భంగా వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు ఖాజాను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండేళ్ళలో కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేసింది ఏమిలేదని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చి ఒక్క ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం తప్పా మరొకటి చేసిందేమి లేదని విమర్శించారు. తమ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తుందని, వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల భరిలోకి దిగుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రఫత్ జహన్, మహమ్మాద్ బర్కత్, ఇమ్రాన్, ఖాసీం, జాబేర్, ఆదామ్, షేక్ ఇబ్రహిం, అల్లాఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీరంగంలో త్రివిక్రముడు కోవెల సంపత్ కుమారాచార్య : డా. కె.వి.రమణాచారి

కోవెల స్మారకోపన్యాసకర్త ఐలయ్యను సత్కరిస్తున్న రమణాచారి, నిత్యానందరావు, హనుమంతరావు, రాధ తదితర అతిథులు

నాంపల్లి, జనవరి 8 ప్రభాతవార్త : జీవించినంతకాలం నిరాడంబరంగా ఉంటూ సాహితీరంగంలో గొప్పస్థాయిని పొంది, తనదైన ప్రత్యేకశైలిలో సాహితీ పరిశోధన, వ్యాకరణం, సద్విమర్శలను కొనసాగించిన త్రివిక్రముడు ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, విస్తరణ సేవావిభాగం, హైదరాబాద్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ నాంపల్లి ప్రాంగణంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన గురువారం జరిగిన ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య స్మారకోపన్యాసం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు డి.లక్ష్మణాచార్యులు, ఆచార్య బన్న అయిలయ్య, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి ఆచార్య బి.రాధ సారంగపాణి తదితరులతో కలిసి సంపత్కుమారాచార్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. కోవెల హాస్యచతురుడని, నిత్య సాహిత్య ప్రసంగాలలో, చర్చలలో హాస్యరసాన్ని పండిస్తూ ఆహుతులను ఆకట్టుకునేవారని, తమ కుటుంబానికి ఆదర్శ మూర్తిగా నిలిచిన నిత్యచైతన్యశీలి అని కొనియాడారు. స్వయంగా కోవెల శిష్యుడుగా ఆయనపట్ల ఎనలేని గురుభక్తి ఉందని చాటిచెప్పారు. పాండిత్య వంశానికి చెందిన కోవెలకు ఆత్మాభిమానం, పోరాటతత్వం, భాషాపటిమ, సంస్మరణ దృక్పథం మెండన్నారు. దేశం, కాలం సాహిత్యాలపై దృష్టిపెట్టి దేశీయ రచనలు అనేకం చేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆచార్య బన్న ఐలయ్యను అతిథులు ఘనంగా సత్కరించారు.

కిలీమంజారోపై రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- అరుదైన ఘనతను సాధించిన అల్కాపూర్ వాసి హితేష్

దక్షిణాఫ్రికాలోని కిలీమంజారోపై మువ్వన్నెల పతాకంను ఎగురవేస్తున్న నార్సింగి సర్కిల్ అల్కాపూర్ వాసి హితేష్ దృశ్యం

నార్సింగి, జనవరి 8 ప్రభాతవార్త : అతను ఓ ఐటీ కంపనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. సాహసాలు చేయడం ఆయనకు అలవాటు. భూమిపైనే నాలుగో అతి ఎత్తైన మౌంట్ కిలీమంజారో పర్వతాన్ని అధిరోహించి, దాని శిఖరంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు. ఈ ఘనతను సాధించడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, కాలనీ ప్రజలంతా సంతోషంను వ్యక్తం చేస్తున్నారు. హితేష్ తండ్రి రమణ ఏయిర్ ఫోర్స్‌లో పని చేసి పదవీ విరమణ పొందారు. తండ్రి నుంచే హితేష్‌కు ధైర్యం, క్రమశిక్షణ అలవడ్డాయి. నార్సింగి సర్కిల్ మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌కు చెందిన హితేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఈ పని చేసేందుకే సమయం సరిగ్గా లభించదని ఇతర ఉద్యోగులు పేర్కొంటుంటారు. కానీ హితేష్ ఈ ఉద్యోగంను చేస్తూనే పర్వతారోహణపై ఉన్న మక్కువతో ఎత్తైన పర్వతాలను సులభంగా ఎక్కడంను అలవాటుగా మార్చుకున్నాడు. దక్షిణాఫ్రికలో ఉన్న మౌంట్ కిలీమంజారోపై అత్యంత కఠినమైన వాతావరణంను తట్టుకొని, పట్టుదలతో పైకి ఎక్కి సత్తా చాటాడు. తీరికలేని పని ఒత్తిడిని తట్టుకుంటూనే పర్వతారోహణ వంటి సాహస క్రీడలో రాణించడం యువతకు స్ఫూర్తిదాయకమని మణికొండ వాసులు పేర్కొంటున్నారు. హితేష్ సాధించిన ఈ ఘనత పట్ల ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

సోనియాగాంధీ త్వరగా కోలుకోవాలని మహాకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

మహాంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వి. హనుంతరావు

హైదరాబాద్, జనవరి 8 ప్రభాతవార్త : అంబర్‌పేట్ మహాంకాళి ఆలయంలో యూపీఏ ఛైర్ పర్సన్ సోనియాగాంధి త్వరగా కొలుకోవాలని అంబర్‌పేట్ మహాంకాళి ఆలయంలో కాంగ్రెస్ సినియర్ నాయకులు, మాజీ రజ్యసభ సభ్యులు వి .హనుమంతరావు మహ మృత్యుంజయ హోమం నిర్వహించారు .ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సినియర్ నాయకులు పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, ఆర్ లక్ష్మణ్ యాదవ్, పుల్లా నారాయణ స్వామి , దిడ్డి రాంబాబు , గరిగంటి రమేశ్,జనగాం సత్తిబాబు ,శంబుల శ్రీకాంత్ గౌడ్ ,పంజాల వెంకటేశ్ గౌడ్ , గడ్డం శ్రిధర్ గౌడ్ , కోటం అనిల్ కుమార్ , తోలుపునూరి కృష్ణ గౌడ్,చంగలి సుధాకర్,గడ్డం సునీల్ గౌడ్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ జోన్ డిసిపిగా రమణారెడ్డి బాధ్యతల స్వీకరణ

రమణారెడ్డికి పుష్పగుచ్చాలు అందిస్తున్న చింతమనేని శ్రీనివాస్.

జూబ్లీహిల్స్, జనవరి 8, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్ జోన్ డీసీపీగా ఎ. రమణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పశ్చిమ మండలంగా ఉండగా తాజాగా చేసిన జీహెచ్ ఎంసీ పునర్విభజనల నేపథ్యంలో పోలీసు శాఖలోనూ మున్సిపల్ తరహాలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ జోన్‌కు రమణారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన ప్రస్తుతం రాచకొండ ఎస్ఓటీ డీసీపీగా ఉన్నారు. ప్రస్తుతం పశ్చిమ మండల డీసీపీగా వ్యవహరించిన చింతమనేని శ్రీనివాస్ శేరిలింగంపల్లి డీసీపీగా బదిలీ అయ్యారు. కాగా గురువారం బాధ్యతలు స్వీకరించిన రమణారెడ్డికి చింతమనేని శ్రీనివాస్ పుష్ప

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు,అధికారులు

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు,అభిమానులు

కంటోన్మెంట్,జనవరి 8 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌ను గురువారం తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు,వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత 10 రోజుల నుంచి ఎమ్మెల్యే అయ్యప్ప స్వామి మాల ధరించడం, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంతో అందుబాటులోలేక పోవడంతో గురువారం కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావడంతో క్యాంప్ కార్యాలయం సందడితో కోలాహాలంగా మారింది.

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి కృషి : నర్మద

5వ వార్డు కాకగూడలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న బానుక నర్మద తదితరులు

కంటోన్మెంట్,జనవరి 8 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ తెలిపారు. గురువారం 5వ వార్డు కాకగూడ,బ్రుక్‌బాండ్ కాలనీ 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్మద మాట్లాడుతూ ఈటెలరాజేందర్ సహకారంతో కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ప్రకాశ్, ప్రభాకర్ రావ్, శశిధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో సేవలు అందించడం ఎంతో అభినందనీయం

పర్వత్‌నగర్‌లో పేదలకు ఉచితంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

యూసుఫ్‌గూడ జనవరి 8, ప్రభాతవార్త : సమాజంలో ఉన్నదాంట్లో కొంత ఇతరులకు దానం చేసినప్పుడే జీవితంలో నిజమైన సంతృప్తి లభిస్తుందని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్ మినీ ఫంక్షన్ హాల్లో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లెప్రసీ పేషెంట్లకు ఉచితంగా నిత్యవసర సరుకులతో పాటు దుస్తులు బియ్యం, దుప్పట్లు ఇతర అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమాజంలో అత్యంత అవసరంలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్వత్‌నగర్ అధ్యక్షులు జాహేద్ షరీఫ్, రమేష్, డానియల్ రాజు, పాండు, కొండయ్య, రేవతి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హతగల ఏఈఈలకు త్వరలో డిఈఈలుగా పదోన్నతులు

- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధ్యక్షుడు బండి శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.నాగరాజు, కోశాధికారి సంతోష్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త: అర్హతల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ)లు అందిరికీ త్వరలో డిఈఈలుగా పదోన్నతులు కల్పిస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం డా.బిఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (ఏటీఏఈఈ)2026 డైరీ, క్యాలెండర్‌ను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఎల్. నాగరాజు, రాష్ట్ర కోశాధికారి సంతోష్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఇంజనీర్ల సమస్యలను మంత్రికి వివరించగా ఆ సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇస్తూ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే శాఖకు మంచి గుర్తింపును తేవాలని కోరారు. అదే విధంగా అన్ని అడ్డంకులను అధిగమించి ఇరిగేషన్‌శాఖలో 200 ఏఈఈలకు డీఈఈలు గా పదోన్నతులు కల్పించామని మిగతావారికి కూడా త్వరలోనే ప్రమోషన్స్ ఇస్తామని హామీ ఇచ్చారు.మంత్రిని కలిసిన వారిలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మనోహర్,రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మహేందర్నాథ్,జాయింట్ సెక్రటరీ సుష్మ,జయశ్రీ,అరుణ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నారాయణ హోమం

మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీ లక్ష్మీనారాయణ హోమంలో పాల్గొన్న ప్రముఖ సినీ నటులు తనికెళ్ల భరణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు.

యూసుఫ్‌గూడ జనవరి 8, ప్రభాతవార్త : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్‌లు అన్నారు. గురువారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో స్థానిక సీనియర్ బీజేపీ నాయకులు ఎన్.అంజిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనారాయణ హోమం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రజలంతా శ్రీ లక్ష్మీనారాయణుని కృపకు పాత్రులై ఆయురారోగ్య ఐశ్వర్యాలు సుఖ:శాంతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విష్ణు భట్ల లక్ష్మీనరసింహ శర్మ, మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి పులి గోళ్ల శ్రీనివాస్ యాదవ్, విజయ్, సాయిచంద్, అభిలాష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత : బేరి రామచందర్‌యాదవ్

శేరిలింగంపల్లి,జనవరి 8 ప్రభాతవార్త

కాలనీల్లో చెత్తాచెదారం వేయకుండా పరిశుభ్రతను పాటించటం ప్రజలందరి బాధ్యతగా తీసుకోవాలని నేతాజీనగర్ కాలనీ అధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌పరిధిలోని నేతాజీనగర్‌కాలనీలో జీహెచ్ఎంసీవారి సహకారంతో కాలనీలో శుభ్రత స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. కాలనీలనోని ఓపెన్ మోరీలు, నాళాలు పరిసరాలు చెత్తా చెదారంతో నిండిపోయి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జీహెచ్ఎంసీ పారిశుద్య విభాగం అధికారులకు సమాచారం అందించటంతో గురువారం జీహెచ్ఎంసీ అధికారుల కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.కాలనీ వీదుల్లో నిలిచిపోయిన చెత్తాచెదారాన్ని తొలగించటంతో పాటు డ్రైనేజీలో పేరుకున్న వ్యర్థాలను శుభ్రంచేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్‌యాదవ్ మాట్లాడుతూ.. కాలనీలో ప్రజలు వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటిలోని చెత్తను బహిరంగ ప్రదేశాలలో పడవేయకుండా జీహెచ్ఎంసీ నియమించిన చెత్తబండిలోనే తప్పనిసరిగా వేయాలన్నారు. మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలని, బయట చెత్త వేయటం వల్ల దోమలు, ఈగలు, దుర్గంధం ప్రబలి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రాణాంతకమైన రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సూపర్‌వేజర్ భరత్,రాందాస్‌లతో పాలు కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన జీహెచ్ఎంసీ సిబ్బంది

అమ్మవారి దయతోనే రచయిత అవుతారు : డా. కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, జనవరి 8 ప్రభాతవార్త : గొప్ప సాహిత్యకారుడు, రచయిత కావాలంటే అమ్మవారి దయ తప్పక ఉండడంతోపాటు ఆత్మశక్తి, ధైర్యం, స్థయిర్యం, సాహసం అన్నీ ఉండాలని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి నొక్కివక్కాణించారు. ఇవన్నీ రంగనాథ్ దేశిరాజులో మెండుగా ఉన్నాయని ఆయన ప్రశంసించారు. ఇందులోని 77 కవితలు అత్యంత రుచికరమైన కదంబం భోజనంలా అన్నిరకాల రుచులు రంగరించి కలబోసినట్లున్నాయని రమణాచారి చమత్కరించి రచయితను ఎంతగానో అభినందించారు. శ్రీకళానికేతన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ రచయిత రంగనాథ్ దేశిరాజు రచించిన కవితా సంపుటి కదంబం ఆవిష్కరణ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు డా. ఓలేటి పార్వతీశం, డా. జాడి మురళీధర్, తులసి బాల కృష్ణ, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు లయన్ సాధుశ్యాం ప్రసాద్, పివిఆర్‌కె.ప్రసాద్, కోశాధికారి బి.స్వరాజ్ కుమార్, నిర్వహణ కార్యదర్శి డి.రామకోటేశ్వరరావు, కవితా సంపుటి రచయిత రంగనాథ్ దేశిరాజు తదిత రులతో కలిసి కదంబం కవితా సంపుటిని ఆవిష్కరించి తొలిప్రతిని ఆదరణ ట్రస్ట్ ఛైర్మన్ జాడి మాధవరావుకు అందజేశారు.

కదంబం కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న రమణాచారి, ఓలేటి, మురళీధర్, రంగనాథ్, రామకోటేశ్వరరావు తదితర అతిథులు

ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్

ఎమ్మెల్యే పద్మారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తదితరులు

అడ్డగుట్ట,జనవరి 8 ప్రభాతవార్త: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్. శ్రీనివాస్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మా రావు గౌడ్,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, చామకూర మల్లారెడ్డిలను గురువారం వారి వారి నివాసాలకు వెళ్లినూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ అయ్యప్ప స్వామి ప్రసాదం అందజేశారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి

అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త: పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జి. జితేందర్ రెడ్డి అధికారులకు సూచించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని ఎస్.ఎస్.సి యాక్షన్ ప్లాన్ అలాగే ప్రీమాట్రిక్ ఉపకారవేతనాల దరఖాస్తుల పురోగతి పై జిల్లా విద్యాధికారి, జిల్లా సంక్షేమ అధికారులతో కలిసి సమీక్షించారు.పదవ తరగతిపరీక్షలకు హాజరుకానున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, రివిజన్ టెస్టులు, అభ్యాసం సులభతరం చేసేందుకు "అభ్యాస డిపిక" పేరుతో స్టడీ మెటీరియల్, అలాగే సాయంకాలం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని జిల్లా విద్యాధికారు ఈరోహిణి తెలిపారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అలాగే విద్యార్థులు ప్రముఖ కళాశాలల్లో సీటు పొందేందుకు అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ముందున్న 60 రోజులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.తదుపరి ప్రీమెట్రిక్ ఉపకారవేతనాల దరఖాస్తుల పై సంక్షేమ శాఖాధి కారులను సమీక్షించారు. అర్హులైన ప్రతీ విద్యార్థి ఈ పథకం నుండి ప్రయోజనం పొందేలా చూసేందుకే చివరి తేదీ పొడిగించబడినందున, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతీ విద్యార్థి ఈ పథకం కింద నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. దరఖాస్తుకు కావల సిన కుల, ఆదాయ పత్రాలు విద్యార్థులకు త్వరిత గతిన అందేలా చూడాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారులు, గురుకులాల కోఆర్డినేటింగ్ ఆఫీసర్లు, పాల్గొన్నారు.

శభాష్ ట్రాఫిక్ పోలీస్

- రోడ్డుపై పడ్డ కంకరను ఎత్తివేసిన పోలీసులు

తెలంగాణ పోలీసు అకాడమి వద్ద రోడ్డుపై పడ్డ కంకరను ఎత్తుతున్న ట్రాఫిక్ పోలీసుల దృశ్యం

నార్సింగి, జనవరి 8 ప్రభాతవార్త : తెలంగాణ పోలీసు అకాడమి సర్కిల్ వద్ద ఉన్న రోడ్డుపై ఓ టిప్పర్ నుంచి పెద్దమొత్తంలో కంకర పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడి, కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ముందుగా ట్రాఫిక్ పోలీసులు, రాజేంద్రనగర్ సర్కిల్ మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించినా వారు సకాలంలో స్పందించలేదు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ పోలీసులే కార్మికులుగా మారారు. చీపురు, చాట పట్టుకొని రోడ్డుపై పడ్డ కంకరను ఎత్తివేసి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనదారులంతా ట్రాఫిక్ పోలీసుల పనితీరుకు ముగ్ధులయ్యారు. ట్రాఫిక్ విధులు మాత్రమే కాదు... అవసరమైతే ఏ పనిని చేసేందుకైనా వెనుకాడబోమని పోలీసులు నిరూపించుకున్నారంటూ వాహనదారులు ప్రశంసిస్తున్నారు. ఈ రోడ్డుపై వెళ్లే వారందరి నోటా "శభాష్ ట్రాఫిక్ పోలీస్" అన్న మాటలే వినిపించాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎంత కఠినంగా వ్యవహరించి చలానాలు వేస్తారో... అదే తీరుగా వాహనదారులను ట్రాఫిక్ చక్రంలోంచి విడిపించేందుకు పని చేస్తామని పోలీసు అకాడమి వద్ద పని చేసిన ట్రాఫిక్ పోలీసులు నిరూపించుకున్నారు.

వాహన చోదకులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి : శంకర్ రాజ్

కంటోన్మెంట్,జనవరి 8 ప్రభాతవార్త: విద్యార్థులకు రోడ్డు భద్రతలపై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు భద్రత పాటిస్తే ప్రమాదాలను నివారించ వచ్చని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజ్,సికింద్రాబాద్ ట్రాన్స్‌పోర్ట్ రీజినల్ అధికారి ఎర్రి స్వామి, సాయి చరణ్‌లు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం బోయిన్‌పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీకి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. వాహన దారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పని సరిగా పాటించాలన్నారు. కండీషన్‌లో ఉన్న స్కూల్ బస్సులను నడపాలని సూచించారు. సిగ్నల్స్‌జంపింగ్, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్లు జయ్ చందర్, నేహా, నర్సింహ్మ స్వామిలతో పాటు పల్లవి మోడల్ స్కూల్ కరస్పాండెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు చైర్మన్ పదవికి మధుసూదన్ రెడ్డి రాజీనామా

-రైతుల పాల బిల్లులకు రూ.12 కోట్లు ఇస్తానని డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి హామీ

హయత్ నగర్, జనవరి 8 ప్రభాతవార్త : నార్ముల్ మదర్ డెయిరీలో గురువారం నిర్వహించిన అత్యవసర సమావేశం రాసాభాసగా మారింది. పాల బిల్లులు చెల్లించని పక్షంలో చైర్మన్ రాజీనామా చేయాల్సిందేనని డైరెక్టర్లు, రైతులు డిమాండ్ చేశారు. దాదాపు 3 గంటలకు పైగా సమావేశం జరిగింది. చైర్మన్ రాజీనామా చేసి తనను చైర్మన్ గా చేస్తే రైతులకు 12 కోట్ల రూపాయల పాల బిల్లులను తాను చెల్లిస్థానని డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి చెప్పారు. దీంతో ఎట్టకేలకు చైర్మన్ మధుసూదన్ రెడ్డి రాజీనామా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నష్టాలలో ఉన్న మదర్ డెయిరీ ని లాభాల లోకి తీసుకు వచ్చేందుకు కృషి చేశానన్నారు. సంస్థ ఎం డీ కొంతమంది డైరెక్టర్లు తనకు సహకరించలేదన్నారు. మదర్ విజయ బ్రాండు పాల విక్రయాలలో బోర్డు ఎక్కువ మొత్తం డిస్టిబుటర్లకు కమిషన్ చెల్లించేలా ఎండీ బోర్డు తీర్మానాలను మార్చారని ఆరోపించారు. అప్పుడు ఎం డీ మీద కోపం చేస్తే ఆయన రాజీనామా చేశారన్నారు. కొందరు డైరెక్టర్లు ఆయనకు అండగా ఉంటూ ఆయన అవినీతికి వంత పాడారని మండిపడ్డారు. ఎన్ డీ డీ బీ తో ఒప్పందం వారికి ఇష్టం లేదన్నారు. పదేళ్లుగా సంస్థ లాభ, నష్టాలు, స్టాక్ విషయంలో బ్యాంకుకు తప్పుడు సమాచారం అందించారని తెలిపారు. దీని కారణంగానే బ్యాంకు వాళ్ళు రుణం ఇవ్వడానికి కోర్రిలు పెట్టారని చైర్మన్ వివరించారు. ఎండీ ని తొలగిస్తే తప్ప సంస్థ బాగు పడదన్నారు. ఇదే విషయం మండలి చైర్మన్ సుఖ్నేందర్ రెడ్డి కూడా చెప్పారన్నారు. పాల బిల్లులకు ప్రభాకర్ రెడ్డి 12 కోట్ల రూపాయలు ఇవ్వడం రైతులకు మేలు చేస్తుందన్న ఉద్దేశంతో చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తాను డైరెక్టర్‌గా కొనసాగుతానని అవినీతి అక్రమాలపై పోరాడుతానన్నారు.

మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

మంచినీళ్లతో పాలడబ్బాలు శుభ్రం...అధికారులకు పట్టని వైనం

చాంద్రాయణగుట్ట, జనవరి 8, ప్రభాతవార్త : విలువైన మంచి నీళ్లు వృథా చేసినా, ఇతర అవసరాలకు ఉపయోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పే జలమండలి ఉన్నతాధికారులకు పాతబస్తీ అలియాబాద్ రిజర్వాయర్ వద్ద నిత్యం జరుగుతున్న దృశ్యాలు కనిపించటం లేదు. ఆ సమీప బస్తీల ప్రజల మంచినీటి అవసరాలను తీర్చేందుకు జహనుమా రోడ్డు లోని, రిజర్వాయర్ ప్రహారీకి రెండు మంచినీటి నల్లాలు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుండి వివిధ ప్రాంతాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటలలో ప్లాస్టిక్ డబ్బాలలో మంచినీటి తీసుకు వెళుతుంటారు. అయితే కొంత మంది పాల వ్యాపారులు గ్రామాల నుండి పాలను సేకరించి వాహనాలలో పాతనగరానికి సరఫరా చేస్తున్నారు. హోటళ్లు, మిఠాయి తదితర దుకాణాలకు పాలు పోసిన తరువాత ఖాళీ డబ్బాలను తీసుకొని వచ్చి వాషింగ్ పౌడర్, మంచినీళ్లతో శుభ్రం చేస్తున్నారు. వాహనాలలో పెద్ద ఎత్తున పాల డబ్బాలను తెచ్చి నిత్యం ఇక్కడ శుభ్రం చేస్తున్నారు. మంచినీటి కోసం వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. వీరి కారణంగా ఆ ప్రాంతం పూర్తిగా చిత్తడిగా మారుతుంది. విలువైన మంచినీరు పెద్ద ఎత్తున పాలడబ్బాలను శుభ్రం చేసేందుకు వినియోగిస్తూ నేలపాలు చేస్తున్నారు. డబ్బాలు కడిగిన నీళ్లకు పాల వాసన తోడై ఈగలు ముసురుతున్నాయి. స్థానికంగా అశుభ్ర వాతావరణం నెలకొంటుంది. జలమండలి ప్రహరీకి ఉన్నా మంచినీటి నల్లాల వద్ద రోజూ పాల డబ్బాలను శుభ్రం చేస్తూ విలువైన మంచినీరు వృథా చేస్తున్నా అధికారులకు కనిపించక పోవటం విడ్డూరం. నగరం లోని కొన్ని ప్రాంతాలలో వాహనాలు కడుగుతున్నారని చెప్పి పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తున్న అధికారులకు ఇక్కడి దృశ్యాలు కనిపించక పోవటంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అలియాబాద్ రిజర్వాయర్ వద్ద నల్లా నీళ్లతో పాల డబ్బాలను శుభ్రం చేస్తున్న వ్యాపారులు

సంక్రాంతి సెలవులపై ఊరెళితే...ఈ జాగ్రత్తలు తప్పనిసరి : సిఐ గడ్డం మల్లేశ్

కుత్బుల్లాపూర్, జనవరి 8 ప్రభాతవార్త

సంక్రాంతి సంబరాలకు ఊళ్లలకు వెళ్ళే ప్రజలు తగుజాగ్రత్తలు పాటిస్తే దొంగలబాధలనుండి దూరమయ్యే అవకాశంతోపాటు శాంతి సంతోషాలు తమ సొంతమని జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ అన్నారు. గురువారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోలకు సంక్రాంతికి ఊరెళ్లే వారు తీసుకోవాల్సిన పలుజాగ్రత్తలకు సంబందించిన బ్యానర్లను ఆయన కట్టించడంతోపాటు ప్రజలను, వాహనదారులకు అవగాహణ కల్పించారు. సంక్రాంతి సంబరాలకు ఊరువెళ్లే ప్రజలు తమ ఇళ్లకు తాళాలువేసి వెళ్ళే సందర్భాలను దొంగలు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రమాదం వుందని ఆయన హెచ్చరించారు. దొంగల నివారణలో భాగంగా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ద్వారా ప్రతికాలనీకి తిరుగుతూ ప్రజల్ని చైతన్యం చేస్తున్నట్లు, ఊరికివెళ్లే ప్రజలు తమ ఇళ్లకు తాళాలు సరిగా వేసుకోవాలని, విలువైన వస్తువులు ఇళ్లలో దాచిపెట్టిపోరాదరని, ఊరెళ్లేమందు తగిన సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌లో అందిస్తే గస్తీని మరింత ముమ్మరంచేయడం ద్వారా కొత్తవారి కదలికలపై నిఘా ముమ్మరం చేస్తామరని, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ముమ్మరం చేస్తామరని, ప్రజలు కూడా అనుమనాస్పద వ్యక్తుల కదలికలపై సమాచారం అందించాలని విజ్ఞప్తిచేశారు. ఈవిషయాలపై జీడిమెట్ల పోలీసులు పహరాద్వారా దొంగతనాల నివారణకు తగుచర్యలు చేపట్టేందుకు వీలవుతుందని గడ్డం మల్లేశ్ విజ్ఞప్తిచేశారు. ప్రజలు పోలీసులతో సహకరించి నేర రహిత పోలీసు సేవలను అందుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

ఆటోలకు ఫెక్సిలను ఏర్పాటుచేసి చూపుతున్న జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్

12,13తేదీల్లో "ఈవేస్ట్ శానిటేషన్ డ్రైవ్ "

-నగర వ్యాప్తంగా 300 వార్డుల్లో నిర్వాహణ

హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణతో పాటు సుస్థిర పారిశుద్ధ్య లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా మెగా ఈవేస్ట్ శానిటేషన్ డ్రైవ్‌ను ఈనెల 12, 13 తేదీల్లో నగరవ్యాప్తంగా 300 వార్డుల్లో నిర్వహించనుంది. ఈడ్రైవ్ ద్వారా ప్రజల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడంతో పాటు, నివాస, వాణిజ్య, ప్రజా ప్రాంతాల నుంచి ఈవేస్ట్‌ను సేకరించి శాస్త్రీయంగా ప్రాసెస్ చేస్తారు. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, టీవీలు, బ్యాటరీలు, యూపీఎస్‌లు, పవర్ బ్యాంకులు వంటి వివిధ రకాల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఈ డ్రైవ్‌లో సేకరించనున్నారు. ప్రతి సర్కిల్‌కు ప్రత్యేకంగా బ్రాండెడ్ ఈవేస్ట్ సేకరణ వాహనాలను ఏర్పాటు చేయనున్నారు. సేకరించిన ఈవేస్ట్‌ను దుండిగల్‌లోని ఈవేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించి నిబంధనల ప్రకారం నిర్వహించనున్నారు. ప్రతి వార్డులో తాత్కాలిక ఈవేస్ట్ సేకరణ కేంద్రాలను గుర్తించారు. ఈ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, పారిశుద్ధ్య అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఈవేస్ట్ సరైన నిర్వహణ ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు చురుకుగా పాల్గొనాలని కర్ణన్ పిలుపునిచ్చారు.

సమాజానికి సైకాలజిస్టుల సేవలు అత్యంత అవసరం

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: నేటి ఉరుకుల, పరుగుల జీవితంలో పెరుగుతున్న వత్తిళ్ళ దృష్ట్యా సమాజానికి సైకాలజిస్టుల సేవలు ఎంతో అవసరమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. ఈ మేరకు తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ సేవలను ఆయన కొ

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన అజయ్ యాదవ్

ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకుర అజయ్ యాదవ్, కొత్త కిషోర్ గౌడ్, ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారులు

బోడుప్పల్, జనవరి 8 ప్రభాతవార్త ;

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ డివిజన్ అంబేద్కర్ నగర్ లో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ పూజా కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ , మాజీ కార్పొరేటర్ జక్కా పద్మ రాములు , మాజీ ఎంపిటిసి నత్తి మైసయ్య మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పేద కుటుంబాలకు స్వంత గృహ సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు అందజేసింది. ఈ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూరింది తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు మాట్లాడుతూ... రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో తమకు సొంత ఇల్లు కలగజేసినందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్ కి జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కిషోర్ గౌడ్

బోడుప్పల్, జనవరి 8 ప్రభాత్తవార్త ;

నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాకు ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పీర్జాదిగూడలో సంక్రాంతి ముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరణ

సంక్రాంతి ముగ్గుల పోటీల పోస్టర్లను మేడిపల్లి పార్టీ కార్యాలయంలో ఆవిష్కరిస్తున్న మాజీ మేయర్ జక్కా వెంకటరెడ్డి, దొంతిరి హరి శంకర్ రెడ్డి , బిఆర్ఎస్ నాయకులు

మేడిపల్లి, జనవరి 8 ప్రభాతవార్త ;

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నిర్మల ఆధ్వర్యంలో జనవరి 11 ఆదివారం మేడిపల్లిలోని పార్టీ కార్యాలయం వెనక గ్రౌండ్లో జరగనున్న ముగ్గుల పోటీల పోస్టర్‌ను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లో కళాత్మకతను ప్రోత్సహించడంతో పాటు, ప్రజల్లో పండుగ ఉత్సాహాన్ని మరింత పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరు మహేష్ , మధుసూదన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, శ్యామల సాయిలు, శ్రీనివాస్ రెడ్డి, శ్యామల శ్రీనివాస్, ఆకుల సత్యనారాయణ, ఆంజనేయులు, రాజశేఖర్ రెడ్డి, సతీష్ గౌడ్, అశోక్, శేఖర్, బుల్లెట్ శంకర్, కిరణ్ నాయక్, అమర్ పటేల్ , బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : సైపూల్లా

సమావేశంలో పాల్గొన్న డిసిసి అధ్యక్షులు సైపూల్లా, చెకలేకర్ శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, జనవరి 8, ప్రభాతవార్త:

గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని డిసిసి అధ్యక్షుడు సైపూల్లా పేర్కొన్నారు. టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సలీం నగర్ లో మలక్ పేట్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్చార్జ్ జావిద్, సుబ్రహ్మణ్యం, హైదరాబాద్ నగర మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్ సింగ్, డివిజన్ అధ్యక్షులు రాహుల్ సింగ్, షాహిద్ ఖాన్, చక్రపాణి, షకిల్, లింగాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు మహేష్ , మూసా, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్

మల్కాజిగిరి జనవరి8,ప్రభాతవార్త : డివిజన్ పరిధిలోని సంజయ్ నగర్ నుండి సత్యనారాయణ కేఫ్ వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. 13 లక్షల రూపాయలతో చేపట్టిన సంజయ్ నగర్ నుండి సత్యనారాయణ కేఫ్ కు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను ఆమె గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ దివ్య జ్యోతి నాయకులు మేకల రామ యాదవ్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : కిషన్

తుర్కయంజాల్ జనవరి8,ప్రభాతవార్త

జిహెచ్ఎంసీ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోనీ రాగన్న గూడలో గల ఆదిభట్ల సర్కిల్ కార్యాలయం ముందు పారిశుధ్య విభాగంలో మరియు డ్రైవర్లుగా పనిచేస్తున్న 48 మంది కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న వేతనాలను 10వ తేదీ లోపు అందరికీ వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కిషన్ ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ...తుర్కయంజాల్ డివిజన్లో మున్సిపాలిటీగా ఉన్న కాలంలోనే పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న కాలనీలలో పారిశుద్ధ్య పనులు మరియు ఇతర పనులను నిర్వహించడానికి రెండు సంవత్సరాల క్రితం 48 మంది కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడం జరిగిందనీ వీరందరికీ ఔట్సోర్సింగ్ కార్మికుల వలే కాకుండా మూడు, నాలుగు నెలలకోసారి వేతనాలు ఇస్తున్న పరిస్థితి ఉందనీ కనుక పెండింగ్లో ఉన్న నాలుగు నెలల

వేతనాలను వెంటనే అందజేయాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిహెచ్ఎంసి లో విలీనమైన తర్వాత పాత కార్మికులందరినీ జిహెచ్ఎంసిలో పేర్లు నమోదు చేయించి, వీరిని మాత్రం డైలీ వైజ్ కార్మికుల లాగే చూడడం దుర్మార్గం అనీ వెంటనే వీరందరినీ కూడా జిహెచ్ఎంసిలో అవుట్సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి పేర్లు నమోదు చేసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నేత బడుగు శంకరయ్య సీహెచ్ జ్యోతిబస్, కార్మికులు నార్ల కంటి సాలయ్య, గోపాల్, ప్రవీణ్, అంజి, వెంకట్ రెడ్డి, వెంకటయ్య, చెక్క ప్రదీప్, స్వప్న, మల్లెల జయ, యశోద, వినోద, మంజుల, విష్ణు, రాధిక, లలిత, యాదమ్మ, యశోద,జ్యోతి సంజయ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు

ఫ్లాట్ ఓనర్స్‌కు అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి

-జ్ఞాన దీప్ టవర్స్ ఫ్లాట్స్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్

మలక్ పేట జనవరి 8, ప్రభాతవార్త:

ఫ్లాట్స్ కొనుగోలు చేసి దశాబ్దాలు గడిచినా అక్యుపెన్సీ సర్టిఫికెట్లను తమకు ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదని మూసారం బాగ్ జ్ఞానదీప్ టవర్స్ ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అపార్ట్ మెంట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో జ్ఞాన్ దిప్ టవర్స్ ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ జగన్నాథ్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ప్రేమ్ కుమార్, మేనేజ్ కమిటీ చైర్మన్ పి. గంగాధర్ ,వైస్ ప్రెసిడెంట్ భరత్ నాయక్, కోశాధికారి ఎం. రామలింగం, కల్చరల్ సెక్రెటరీ కుమార్, సంయుక్త కార్యదర్శులు సురేష్ రెడ్డి, లక్ష్మణ్ లు మాట్లాడుతూ రామంతాపూర్ కు చెందిన బిల్డర్ రఘునాథ్ రెడ్డి బిల్డింగ్ నిర్మాణం చేసి ఫ్లాట్స్ ను తమకు విక్రయించారని, దాదాపు 120 ఫ్లాట్స్ ఓనర్స్ కు అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వకుండా రేపు మాపు అంటూ తప్పించుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. బిల్డింగ్ కు సంబంధించిన ఎలాంటి పత్రాలు చూపించడం లేదని పేర్కొ న్నారు. లింక్ డాక్యుమెంట్, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ మ్యాప్ గానీ, నిర్మాణ అనుమతుల పత్రాలు

సమావేశంలో ప్రసంగిస్తున్న అసోసియేషన్ చైర్మన్ జగన్నాథ్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. ప్రేమ్ కుమార్, కోశాధికారి ఎం. రామలింగం తదితరులు

ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2008 సంవత్సరం లో ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పడిందని, అసోసియేషన్ ద్వారానే అన్ని కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అపార్ట్‌మెంట్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. బిల్డింగ్‌కు సంబంధించిన అన్ని రకాల ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయం గురించి స్థానిక ఎమ్మెల్యే బలాల, సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఈ కార్యక్రమంలో పరుగులు ఫ్లాట్ ఓనర్స్ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను తిరిగి సాధించుకున్న కాలనీ అసోసియేషన్ కొత్త కమిటీ

కుషాయిగూడ,జనవరి 8,ప్రభాతవార్త : గత 12 సంవత్సరాలుగా జటిలంగా మారిన షాపింగ్ కాంప్లెక్స్ సమస్యను జై జవాన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎట్టకేలకు తిరిగి సాధించుకున్నదని కాలనీ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ లు పేర్కొన్నారు. జిహెచ్ఎంసి, కోర్టులో అపరిష్కృతంగా ఉన్న జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ తిరిగి కాలనీ అసోసియేషన్‌కు 50 శాతం అర్హత కల్పిస్తూ జిహెచ్ఎంసి అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఎస్ రావు నగర్ డివిజన్ జై జవాన్ కాలనీ అసోసియేషన్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీ చీఫ్ అడ్వైజర్, లైన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు వడ్లోజు జ్యోతిర్మయా చారి సమక్షంలో అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా కాలనీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ ఆదాయం కాలనీ అసోసియేషన్‌కు రాకుండగా, కొంతమంది వ్యక్తుల కారణంగా కోల్పోయి కాలనీ అభివృద్ధికి నిధులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో జిహెచ్ఎంసి అధికారుల

జై జవాన్ కాలనీ కార్యవర్గం సమావేశమైన దృశ్యం...

సహకారంతో పెట్టకేలకు జేజేవన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ నిధులు సగభాగం కాలనీకి మిగిలిన సగభాగం జిహెచ్ఎంసికి వచ్చే విధంగా జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్లో ప్రత్యేకమైన గెజిట్ విడుదలవ్వడం ఎంతో అభినందనీయమన్నారు.భవిష్యత్తులో కాలనీ అభివృద్ధికి కావలసిన కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి(వార్తా చారి), ఎస్పి రావు, ఎస్ ఎం సాహెబ్, ఎస్ ఏ సలీం, ఇబ్రహీం, యాదగిరి రెడ్డి, షణ్ముఖం, ఎలీషా, జిఎం పాషా, షేక్ అల్లా బక్షి, వేణుగోపాల్, బాల్రాజ్, సుందర్, వెంకట్ రెడ్డి ,రత్తయ్య చౌదరి, మహబూబ్ షహీ పాల్గొన్నారు.

11 నుండి 13 వరకు కరణ్‌బాగ్ మల్లన్న స్వామి జాతర ..12న మల్లన్న స్వామి కళ్యాణం

సైదాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర మహోత్సవాన్ని ఈ నెల 11వ తేది ఆదివారం నుండి 13వ తేది మంగళవారం వరకు ఘనంగా నిర్వహించనున్నారు. కరణ్‌బాగ్‌లోని మల్లన్న దేవాలయం 400 సంవత్సరాలకు పైబడిన పురాతనమైన దేవాలయం. కొమరవెల్లి, ఐనవోలు లో మాదిరిగానే ఇక్కడ కూడా మల్లన్నస్వామి పుట్టమట్టితో వెలసి ఉన్నారు. కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా ఇక్కడి మల్లన్న స్వామి భక్తుల నిత్య పూజలు అందుకుంటున్నారు. కరణ్‌బాగ్ మల్లన్న స్వామి జాతరలో భాగంగా 11వ తేది ఆదివారం ఉదయం మేలుకొలుపు, అభిషేకం, బిల్వార్చన, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం గంగతెప్ప, శ్రీ మల్లన్న స్వామి వారి ఊరేగింపు, 12వ తేది సోమవారం ఉదయం మేలు కొలుపు, అభిషేకం, అర్చనలు, కొట్నం, ఉదయం 10 గంటలకు శ్రీ బలిజ మేడలా దేవి, శ్రీ గొల్లకేతమ్మ సమేత శ్రీ మల్లన్న స్వామి వారి కళ్యాణం, మధ్యాహ్నం అన్నదానం, అనంతరం సదరుపటం, అగ్నిగుండాలు, గొలుసు తెంపడం, ఒగ్గుపూజారులకు, శివసత్తులకు సన్మానం, 13వ తేది మంగళవారం సాయంత్రం శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ మహంకాళి అమ్మవార్లకు బోనాల సమర్పణ, వడిబియ్యం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, కొత్తగాజులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఒగ్గు పూజారి మారయ్య బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సంక్రాంతి నుండి ఉగాది వరకు ప్రతి ఆదివారం మల్లన్న స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మల్లన్న స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయం కార్యనిర్వాహణాధికారి వి.ఎన్.వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జాతరలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ప్రాథమిక విద్యాకే ప్రధమ ప్రాధాన్యత : ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే గణబాబు

మలక్ పేట, జనవరి 8, ప్రభాతవార్త:

ప్రాథమిక విద్యాకే ప్రధమ ప్రాధాన్యత అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. గురువారం ఉదయం 59వ వార్డు కార్పొరేటర్ పురె పూర్ణ శ్రీ సురేష్ ఆధ్వర్యంలో 59 వార్డు కొత్త నక్కవాణిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐడిబిఐ బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణ బాబు ముఖ్య అతిథిగా హాజరై కొత్త లైట్స్, ఫ్యాన్స్, బీరువా లు, కుర్చీలు, ఆఫీస్ టేబుల్ లు, వాటర్ పూరీఫైర్ లను అందజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ త్వరలోనే స్కూలుకు నూతన భవనాన్ని నిర్మించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామస్తులు ఉపాధ్యాయులు కలిసి పాఠశాలలో అడ్మిషన్ సంఖ్య పెంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో జనసేన పశ్చిమ ఇంచార్జి అంగ ప్రశాంతి, ఐడిబిఐ బ్యాంకు సీనియర్ జనరల్

పాఠశాల విద్యార్థులకు లైట్స్, ఫ్యాన్స్, బీరువాలు, కుర్చీలు, ఆఫీస్ టేబుల్ లు, వాటర్ పూరీఫైర్ లను అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు తదితరులు

మేనేజర్ కన్వాడీబ్ దాస్,అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మోసిమి జెన (గాజువాక బ్రాంచ్ హెడ్), మేనేజర్ సూరిశెట్టి రమాశంకర్, టిఎన్ టియుసి అధ్యక్షులు నక్క లక్ష్మణ్ రావు, ఊరుకుటి హరి, పూడి విజయభాస్కర్,జగ్గమ్మ శ్రీను, ఆకుల శ్రీను, రాంబాబు,మిత్తిరెడ్డి శంకర్, దేవర ఈశ్వర్ రావు, ఆడారి శ్రీను, మహిళా నాయకులు లక్ష్మి, కుంచమ్మ, పొట్నూరు లక్ష్మి, విద్యార్థులు, తల్లితండ్రులు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ సర్కిల్ డివిజన్లలో పారిశుధ్య పనులు పరిశీలన

డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావు స్పష్టీకరణ

సరూర్‌నగర్, జనవరి 8 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ సర్కిల్ లో పారిశుధ్య స్థితిగతులను తరచుగా తనిఖీలు చేస్తుంటానని డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావు స్పష్టం చేశారు. స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్, ప్రశాంతిహిల్స్, జిల్లెలగూడ, మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్ డివిజన్లలో డిసి ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా అల్మాస్‌గూడ, రాజీవ్ గృహకల్ప, చప్పిడి యాదగిరిరెడ్డినగర్, నాదర్‌గుల్ అంబేద్కర్‌నగర్, లెనిన్‌నగర్ హుడా కాలనీ, జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్, కమలా నెహ్రూనగర్, మీర్‌పేట్ పాత గ్రామం, బడంగ్‌పేట్ గాంధీనగర్, కుర్మల్‌గూడ జెఎన్ఎన్‌యుఆర్ఎం, బాలాపూర్ క్వార్టర్స్, వెంకటాపూర్ వీకర్ సెక్షన్ కాలనీల్లో సానిటేషన్ సిబ్బంది పారిశుధ్య పనులు చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుండి ఆయా డివిజన్లలో పర్యటించిన త్రిల్లేశ్వర్‌రావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యం చేయరాదనీ ఊడ్చిన చెత్తను కాల్చవద్దని అన్నారు.

సానిటేషన్ పనులను తనిఖీలు చేస్తున్న బడంగ్‌పేట్ డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావు

చెత్తను వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పారిశుధ్యానికి సంబంధించిన అధికారులను ఆదేశించారు. అన్ని డివిజన్లలో పారిశుధ్య పరిస్థితులను తాను స్పెషల్ డ్రైవ్‌తో నిమిత్తం లేకుండా తరచుగా పరిశీలిస్తుంటానని త్రిల్లేశ్వర్‌రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ అభినవ్‌కుమార్, ఎఇలు హరీష్, గంగాప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వంకాయల యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ నర్సింహ, పర్యావరణ ఇంజనీర్‌రాము, పలువురు వార్డు అధికారులు, సానిటేషన్ జవాన్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి : ప్రిన్సిపల్ మల్లేష్ గౌడ్

మలక్ పేట, జనవరి 8, ప్రభాతవార్త:

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ గాయత్రి నగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ మల్లేష్ గౌడ్ పేర్కొన్నారు. బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ గాయత్రి నగర్ బ్రాంచ్ లో ఇంగ్లిష్ లిటరరీ క్లబ్ ఆక్టివిటీస్ కార్యక్రమాన్ని వివిధ విభాగాల్లో డిబేట్, క్విజ్, ఎస్సే రైటింగ్. , స్పెల్ బీ, కలిగ్రఫీ, రోల్ ప్లే, ఎలాక్యూషన్ పోటీలను నిర్వహించారు. బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ గాయత్రి నగర్ బ్రాంచి విద్యార్థులు సీనియర్, జూనియర్, సబ్ జూనియర్స్ కేటగిరిలో మొత్తం 12 బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సర్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు క్రీడలలో కూడా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం బహుమతులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, మోనిక, వరలక్ష్మి, విద్యార్థులు తదితర పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సదానందరెడ్డి, మధుసూధన్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విధ్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చంపాపేట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జల మధుసూధన్‌రెడ్డి, బొక్క సదానందరెడ్డిలు అన్నారు. కర్మన్ ఘాట్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కేంద్ర ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడి పాఠశాల్లోని విధ్యార్థులకు గురువారం బొక్క సదానందరెడ్డి నోటు పుస్తకాలు, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం సదానంద రెడ్డి, మధుసూధన్ రెడ్డిలు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అనేక చర్యలు తీసుకుందన్నారు. పేద విధ్యార్థులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ గురుకులాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చిందన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు అభిస్తుందన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వర్, మహిళా అధ్యక్షురాలు రోజా రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు గండికోట శ్రీనాథ్, నాయకులు ముద్ద కళ్యాణ్, సురేం దర్‌రెడ్డి, బొంబాయి, వసంత, సతీష్ గౌడ్, శివ, శ్రీను, చందు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలో పాల్గొన్న మర్రి మమతా

మల్కాజిగిరి జనవరి8,ప్రభాతవార్త :

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లోని అనంత సరస్వతి నగర్ ,న్యూ శ్రీనగర్ కాలనీలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సతీమణి మర్రి మమతా రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు.అనంత సరస్వతి నగర్‌లో సీఖ రమ ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో, న్యూ శ్రీనగర్ కాలనీలో చిన్న యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళల రంగవల్లికలను మమతా రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. చక్కటి రంగుల కలయికతో, సృజనాత్మకతను ప్రతిబింబించే ముగ్గులు వేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆడపడుచులకు బహుమతులు అందజేశారు. అనంతరం అందరికీ